"చిద్రూపీ పరదేవతా భగవతీ శ్రీ రాజరాజేశ్వరి" అంటూ ఆ జగన్మాతకు నమస్కారం చేశారు.

బొంబాయి విమానాశ్రయం దగ్గర డాక్టరుగారు చిలిపిగా అడిగాడు - "బొమ్మలు చెరిగి పోయాయా?" అని

స్వాములవారి వదనంలో పసితనం కనిపించింది. పరమానందం వెల్లివిరిసింది.- హృదయం లోంచి, భగవద్గీతలో పాండవ మధ్యముడు చెప్పిన శ్లోకం వచ్చింది.

"నష్టో మోహః స్మృతిరణబ్ధా త్వత్ప్రసాదాన్మయా చ్యుత
స్థితోస్మి గత సందేహః కరిష్యే వచనం తవ....."

మాయ వేసిన సంకెళ్లు తొలగిపోయాయి. తేలికబడ్డ మనస్సుతో విమానం అమెరికాకు బయలుదేరింది. విషాదయోగం అదృశ్యమయింది. జ్ఞానయోగం ప్రారంభమైంది.

## కల్పన

"మిమ్మల్ని మహంతుగారు రమ్మంటున్నారు" అని వెంకటాచలానికి గురువారం ఉదయం కబురు వచ్చింది.

ఆ వూరు పేరు మధుర కాక పోయినా ఆ వూళ్ళోని మీనాక్షి సుందరేశుల ఆలయంమహా ఆకర్షణీయంగా ఉంటుంది. అమ్మవారి సంగతి చెప్పనే అక్కర్లేదు. భక్తుల మనస్సు గ్రహించి అడగ కుండానే వరాలు ఇచ్చిదీవించే చల్లని తల్లి.

ఏనాడు ఎవరి రూపకల్పనో - ఎవరి తపోఫలమో ఆ తల్లి యీ వాడలో అవతరించి దశాబ్దాలు కాదు - శతాబ్దాలే గడిచాయని చరిత్ర చెబుతోంది. చెప్పలేనిదల్లా ఆలయాన్ని నిర్మించి, మానవ జాతికి కానుకగా యిచ్చి తాము మాత్రం అజ్ఞాతంగా అనామకంగా నిలిచి పోయిన వారిని గురించి.

ధర్మకర్తలు ఉన్నారు. కాని వంశపారంపర్య ధర్మకర్తలు ఎవరూ లేరు. యీ ఆలయం ధర్మకర్తగా పదవి లభించిందంటే అతగాడి పంట పండిందన్న మాటే! అన్యాయం, అవినీతి అడుగుపెట్టనంత కాలం, సవ్యంగా విధి నిర్వహించినంత కాలం బ్రతుకు మూడు పువ్వులు ఆరు కాయలు. పాపపు తలంపు మనస్సులో మసలిందా అంతే! అంతటితో ఆ పద్దు రద్దు.

దిగంబర ఈశ్వరుడి ఇల్లాలైనా ఆ మహాతల్లి పర్వత రాజపుత్రుడి హిమవంతుడి ముద్దు బిడ్డ. అందుకనే సర్వాభరణ భూషిత సర్వైశ్వర్య సమన్విత భక్తజనసులభ కావడం వల్ల కోరికలు తీరిన భక్తులు కృతజ్ఞతతో సమర్పించిన కానుకలు, ఆభరణాలతో ఆ దివ్యమూర్తి సిరిసంపదలతో ఏడుకొండల స్వామికి సమాన స్థాయిలోకి ఏనాడో చేరుకుంది.

పెట్టిన నగ పెట్టకుండా రోజుకొక నగ చొప్పున ఆవిడ అలంకరించుకుంటే మళ్ళీ రెండు సంవత్సరాలకు కాని యీ నగ మళ్లీ ధరించడానికి అవకాశం రాదని జనవాక్యం.

కాలచక్రం ఎన్నో మార్పులను తెచ్చింది.

హిందూ రాజుల వైభవం తగ్గి దేశం తురుష్కల కైవశం అయి పూర్తిగా వారు స్థిరపడకుండానే వరుసగా పరాసులు, బుడత కీచులు, ఆంగ్లేయులు ఈ దేశానికి అధినేతలై పరిపాలిస్తున్న కాలంలో అమ్మవారు నలుగురి దృష్టి నుంచి రవ్వంత కనుమరుగైయింది.

తెల్లదొరలు యీ సీమను వదిలిన తరువాత భారత మాత సర్వ సతంత్ర అయిన అనంతరం అందరి దృష్టి యీ ఆలయం మీదకు, అమ్మవారి మీదకు మళ్ళింది. గత వైభవం తిరిగి వచ్చింది. అజ్ఞాత వాసం నుంచి తిరిగి వచ్చిన యీ దేవిని పూజించి తరించడానికి భక్తులు బారులు తీరి నిలబడ్డారు. ఆ తల్లి దీవెనతో తరించారు.

ఆ ఆలయానికి మహంతు - అంటే మకుటం లేని (లేకపోయినా) మహరాజు. ఎంత హోదా!! ఎంత అధికారం!! వారు నిత్యం నిర్వహించే ధర్మస్థానం, న్యాయసభ. ఆ ప్రాంతానికి అదే సుప్రీం కోర్టు. అక్కడి తీర్పు అందరికి శిరోధార్యమే!!

వారి దగ్గర నుంచి రమ్మని కబురు వచ్చిందని వినగానే వెంకటాచలానికి క్షణకాలం అంతులేని భయం వేసింది. తను ఏదైనా పొరబుటు పని చేశాడా? విధి నిర్వహణ సరిగా జరగ లేదా? అనాలోచితంగా ఎవరి కన్నా తన వల్ల అపకారం జరిగిందా? ఇలా రకరకాల ప్రశ్నలు మనస్సులో కదిలాయి.

కబురు తెచ్చిన వ్యక్తితో, "ఎందుకు రమ్మన్నారు?" అని అడిగారు.

"మహంతుగారు, పేష్కారు గారు, ధర్మకర్తలు అంతా ప్రొద్దున్నే సమావేశమయ్యారు. తమరిని వెంట పెట్టుకుని రమ్మన్నారు" అని అన్నాడు.

వెంకటాచలం ఏమీ మాట్లాడలేదు.

ఇంట్లోకి వెళ్ళి పూజాగృహంలోని ఇష్టదైవానికి నమస్కరించి ఆలయానికి బయలుదేరాడు.

గుమ్మంలోనే ఎదురైయింది, పార్వతీదేవిలాంటి పండు ముత్తైదువ. కుడి కన్ను అదిరింది.

నాలుగు అడుగులు వేశాడో లేదో చిలుకా గోరింకల వంటి నవ దంపతులు ఎదురైయ్యారు.

మనస్సులోని భయం తొలగింది. పాదం చురుకుగా ముందుకు సాగింది.

ఆలయం చేరువైయ్యే సరికి ఆ ప్రాంతం అంతా వేద నాదంతో నిండిపోయింది. పూర్ణకుంభంతో భామలు ఆలయంలోకి వెడుతున్నారు.

వెంకటాచలం ఆలయంలోకి వెళ్ళి దైవదర్శనం చేసుకుని ధర్మకర్తల సమక్షంలోకి లబడ్డాడు.

చిరునవ్వుతో మహంతుగారు పలుకరించారు.

"రా! వెంకటాచలం కూర్చో. నాన్నగారు కులాసాగా ఉన్నారా. అమ్మగారు ఆరోగ్యంగా ఉన్నారా'' అని అడిగారు.

"మీ దయవల్ల క్షేమంగా ఉన్నారు.''

"పిల్లలు ఎల్లా వున్నారు?''

"అమ్మాయి అత్తవారింట్లో ఉంది.అబ్బాయి నా దగ్గరే ఉండి వ్యాపారంలో సహాయం చేస్తున్నాడు.''

"చాలా సంతోషం. నీతో ఒక ముఖ్యమైన పని కలిగి ప్రొద్దున్నే శ్రమ కలిగించాము.'

"ఎంత మాట!! ఆజ్ఞాపించండి''

"ఇది చాలా ముఖ్యమైన పని అని చెప్పాను గదా! ఈ పనికి తగిన వాడు మన నగరంలో ఎవరా అని ఆలోచించాము. ధర్మకర్తలు నీ పేరు సూచించారు.''

"అది నా అదృష్టం.''

"దానికి కారణం కూడా నీకు చెప్పడం అవసరం కనుక ఆ విషయం నీకు మన ధర్మకర్తలలో వృద్ధులు, మా అందరికి గురుతుల్యులు శ్రీ వరదరాజులు గారు వివరంగా చెబుతారు.''

వెంకటాచలం వరదరాజుల గారి వంక తిరిగి నమస్కారం చేశాడు.

ఆయన అలవాటుగా ఒక్క క్షణం కళ్ళు మూసుకుని, "మహాదేవ! మహాదేవ!'' అని కళ్ళు తెరిచి అందరి వంక చూసి చిరునవ్వుగా చెప్పడం మెదలు పెట్టారు.

"ఈ ఆలయంలో వెలసిన శ్రీ మీనాక్షి సుందరేశ్వరులను ఎన్నో తరాలుగా భక్తి ప్రపత్తులతో సేవించుకుంటున్న వంశంలో నీవు పుట్టావు. అంతేకాదు రత్న పరీక్షలో నిష్ణాతులైన వారి వద్ద మంచి శిక్షణ పొందావు. ఆభరణ నిర్మాణంలో దేశ విదేశీయ పద్ధతులని క్షుణ్ణంగా తెలుసుకున్నావు.

అన్నింటికన్న ముఖ్యం న్యాయం, ధర్మం తెలిసిన వ్యక్తిగా పేరు పొందావు.''

వెంకటాచలం మనస్సు ఆనందంతో పరవశించిపోతోంది. ఈ మాటలు తన తల్లి, తండ్రులు, భార్య బిడ్డలు కూడా ఇక్కడ వుండి వింటూంటే ఎంత బాగుండేది అని అనిపించింది.

"ఈ విషయాలన్నీ సమగ్రంగా పరిశీలించిన పిమ్మట యీ పనికి నువ్వు సమర్థుడవని మేమంతా ఏకాభిప్రాయనికి వచ్చాము. నువ్వు మన ఆలయం తరుపున ఇంగ్లండు వెడుతున్నావు!''

"చిత్తం''

"నువ్వు రెండు మూడు రోజులలో బయలు దేరి మదరాసు వెళ్లు. నీకు సంబంధించిన కాగితాలు డబ్బు పేష్కారుగారు ఇస్తారు. శుభమస్తు. దిగ్విజయమస్తు!'' అని అన్నారు.

వెంకటాచలం అందరివంక ఒక్కసారి చూశాడు. మహంతుగారికి నమస్కారం చేశాడు.

"ఈ శుభ సందర్భంగా మీ కుటుంబం తరుపున అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు చేయిస్తున్నాం."

మీ అనుజ్ఞ అయితే ఒక్కసారి యింటికి వెళ్ళి "అంటూ చెప్పబోయాడు." ఆ శ్రమ నీకు అక్కరలేదు. మీ యింటికి కబురు వెళ్ళింది. మీ కుటుంబ సభ్యులంతా అమ్మవారి సన్నిధిలో నీ కోసం ఎదురు చూస్తున్నారు" అని మహంతుగారు అన్నాడు.

"ధన్యుడిని" అంటూ ధర్మకర్తల వెంట అమ్మవారి సన్నిధికి వెళ్లాడు.

వెంకటాచలం యాత్ర దిగ్విజయంగా కావాలని ఘనంగా పూజ జరిగింది.

అమ్మవారి ఆశీస్సులు ఆ కుటుంబానికి దండిగా లభించాయి.

ఆ రోజు సాయంకాలం వెంకటాచలం ఆలయ అధికారులను మళ్లీ కలిసాడు.

"నీ ప్రయాణం గురించి ఎవ్వరితో చెప్పవద్దు" అని మహంతుగారు హెచ్చరికగా అన్నారు.

'ఎందుకని' అని ఇతను ప్రశ్నించకుండానే, స్వంత పనిమీద వెడుతున్నాని చెప్పు. ఆలయం పని మీద వెళ్లినట్టు చెప్పవద్దు. దీనిని గురించి పది మందికి తెలియటం అంత అవసరం లేదు.

నీకు మూడు ముఖ్యమైన ఉత్తరాలు యిస్తున్నాం. మొదటిది మన గవర్నమెంటు ఇచ్చిన అనుమతి పత్రం. రెండవది బ్రిటీష్ గవర్నమెంటు ఇచ్చిన పర్మిషన్. మూడవది దీంట్లో నువ్వు ఇంగ్లండులో చేయవలసిన పని. యీ సందర్భంగా ఎవరిని కలుసుకోవాలో దానికి సంబంధించిన వివరాలున్నాయి. నీ ప్రయాణం నిమిత్తంగా కావలసిన పైకం యీ సంచీలో ఉంది.

ఈ పని చాలా ముఖ్యం. ఇంగ్లండులో పని పూర్తి కాగానే వెంటనే వచ్చేశేయి."

వెంకటాచలం మనస్సులో ఎన్నో ప్రశ్నలు సందేహాలు కలుగుతున్నాయి. కాని మహంతుగారి ఆజ్ఞ శిరసావహించడమే కాని ఎదురు ప్రశ్నలు వేయడం ఆ వూరి సంప్రదాయం కాదు.

అందుకని అతనేం మాట్లాడలేదు. మహంతుగారికి నమస్కరించి ఆలయంలో దైవ దర్శనం చేసుకుని ఇంటికి చేరుకున్నాడు.

భర్త మనస్సు ఎరిగిన ఆ యింటి యిల్లాలు ఆకస్మికంగా యీ ప్రయాణం దేనికి ఎందుకు వెడుతున్నావ్ లండన్‌లో ఎవరితో పని?' అని ఇటువంటి అనవసరపు ప్రశ్నలు వేయలేదు.

"త్వరగా వచ్చేయండి. మీరు లేకపోతే ఇల్లంతా చిన్న బోతుంది" అని గోముగా అంది.

"ఇల్లేనా - లేకపోతే మనస్సు కూడా చిన్నబోతుందా?" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

"ఈ మనస్సు ఎప్పుడూ మీ వెంటనే వుంటుంది కదా?" అని సమాధానం వచ్చింది.

మరునాడు బయలు దేరి మదరాసు వెళ్లాడు. వీసా ఇస్తూ ఆ ఆఫీసరు ఆల్ ది బెస్ట్ అని అంటూనే 'ప్లీజ్ బి కేర్‌ఫుల్' అని అన్నాడు.

'ఎందుకని యీ హెచ్చరికి చేస్తున్నారు' అని వెంకటాచలం అడిగే లోపలే ఆ

ఆఫీసరు, "మీరు ఇంగ్లండు ఎందుకు వెడుతున్నారో మాకు తెలుసు" అని అన్నాడు.

'తను ఎందుకు లండన్ వెడుతూన్నడో తనకు తప్ప అందరికి తెలుసు' - ఈ ఆలోచన రాగానే వెంటాచలం ఒక్క క్షణం నవ్వుకున్నాడు.

హోటలుకు రాగానే ఆ మూడో ఉత్తరం చదువుదామని కవరు చింపాడు.

దాంట్లో రెండే వాక్యాలు ఉన్నాయి.

నువ్వు ఏ ఫ్లైట్‌లో లండను చేరుతున్నది మన లండన్ ఇండియన్ హై కమిషన్‌లో ఉన్న మిసెస్‌దేశ్ పాండే కు కేబిల్ ఇవ్వవలసింది, ఆవిడ నిన్ను ఎయిర్ పోర్ట్‌లో కలుస్తుంది. అన్ని విషయాలు ఆవిడ నీకు చెబుతుంది. ఆవిడ చెప్పిన ప్రకారం చేయవలసింది.

• • •

ఇంగ్లండు ప్రయాణం ఏమి ఒడిదుడుకులు లేకుండా జరిగింది.

మిసెస్‌దేశ్‌పాండే ఎయిర్ పోర్ట్‌లో కలుసుకుంది. 'ప్రయాణం బాగా జరిగిందా' అని కుశల ప్రశ్న వేసింది.

హొటలు జేరిన తరువాత తనను ఇంత కాలం వేధిస్తున్న ప్రశ్న అప్రయత్నంగా మనస్సులోంచి బయటకు వచ్చింది.

"నేను యీ నగరంలో చేయవలసిన మహత్కార్యం ఏమిటి?" అని అడిగాడు.

"మీకు రత్న పరీక్ష. అందులో పురాతన ఆభరణాలని గురించి బాగా తెలుసు అని అంతా అంటారుట నిజమేనా?" అని అడిగింది.

"చేసేది నగల వ్యాపారం. దానికి సంబంధించిన విషయాలు తప్పని సరిగా తెలుస్తాయి."

"అసలుకు నకిలీకి తేడా వెంటనే కనిపెట్టగలరా?"

"నా వ్యాపారంలో ప్రధాన అంశం అదే..."

"ఈ రోజు సాయంకాలం మీ నైపుణ్యానికి అగ్ని పరీక్ష. మీకు ఒక ఆభరణం చూపిస్తాము. అది కల్తీ కాదని మీ నిర్దారణ చేస్తే, ఒక క్లిష్ట సమస్య పరిష్కారం అవుతుంది.'

"ఆ సమస్య ఏమిటో నేను తెలుసు కోవచ్చునా?"

పరిష్కారం అయిన తరువాత తెలుస్తుంది."

ఆ రోజు సాయంకాలం ఇద్దరు కలసి లండన్‌కు దగ్గరలో ఉన్న ఒక పల్లె ప్రాంతానికి వెళ్లారు. అది ఒకనాడు వైభవంగా బ్రతికిన ప్రాంతం. ఆ గుర్తులు ఇంకా అక్కడక్కడ కనిపిస్తున్నాయి.

కారు చాలాఅందమైన భవనం ముందు ఆగింది. బహుశః వీరి రాక కోసం ఆ యింటివారు ఎదురు చూస్తున్నట్టున్నారు. కారు పోర్టికోలో ఆగగానే వెంటనే సింహద్వారం తెరుచుకుంది. ఇంటి నౌకరు స్వాగతం పలికాడు.

ఆ ఇంటి అందం, దాంట్లో వున్న అందమైన వస్తువులు చూస్తూంటే వెంకటాచలానికి ఎంతో ఆనందం వేసింది.

"ఇటువంటి వారు ఇంకా ఉన్నారు కాబట్టే శిల్పకళలు ఇంకా బ్రతుకు తున్నాయి.'
' అని మెచ్చుకున్నాడు.

లోపలి తలుపు తెరుచుకుని ఆవిడ డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది.

"మిష్టర్ వెంకటాచలం...మిసెస్ ఎలిజబెత్ రిచర్డ్‌సన్" అంటూ ఆవిడని మిస్స్ దేశ్‌పాండే పరిచయం చేసింది.

అరవై డెబ్బై సంవత్సరాల వయస్సు ఉన్న ఆ వ్యక్తి కడిగిన ముత్యంలాగా, అపరంజి బొమ్మలాగా వుంది. అంత వైభవంలోను ఏదో విషాదం ఆ ముఖంలో కనిపిస్తోంది. బట్లరు వంక తిరిగి "ఎర్ర రంగు నగల పెట్టె తీసుకురా" అని అన్నది.

క్షణంలో ఆ పెట్టె ఆవిడ దగ్గరకు వచ్చింది. ఆ పెట్టె తెరిచి ఆ నగ వంక రవ్వంత సేపు చూసింది. గడిచిపోయిన విషాధ గాధల చాటు నుంచి ఒక్కనిట్టూర్పు వచ్చింది.

"ఆయన చాలా మంచి వాడు. కాని మూర్ఖుడు. బహుశః పడుచు ప్రేమికులు అంతా ఇంతే కాబోలు" అని అంటూ ఆపెట్టెని శ్రీమతి దేశ్‌పాండేకు ఇచ్చింది. ఆవిడ ఆ పెట్టెను వెంకటాచలానికి యిస్తూ... "ఒక్కసారి మీరు చూసి అభిప్రాయం చెప్పండి" అని అంది.

అరగంట పరీక్ష చేసి, "ఇది అద్భుతమైన కళాఖండం. చాలా శక్తివంతమైన భూషణం. బీజాక్షరాలు, శ్రీచక్రం వున్నయీ ఆభరణం ఆలయంలో వుండే దేవీ మూర్తులే ధరించగలరు. భరించగలరు. సామాన్య మానవుడి చేతిలో ప్రమోదం కంటె ప్రమాదమే ఎక్కువ కలిగిస్తుంది" అని అన్నాడు.

"ఈ రహస్యం తెలియక పోవడం వల్లనే ఇది మా కుటుంబానికి పెద్ద శాపంగా మారింది. వెంటనే తీసుకుని వెళ్ళిపొండి. కనీసం ఇహనైనా మాకు శాంతి దొరుకుతుందేమో!!'
' అంటూ శ్రీమతి ఎలిజబెత్ లేచి నిలబడింది.

శ్రీమతి దేశ్‌పాండే ఆ పెట్టె తీసుకుని వెంటాచలంతో హోటలుకు తిరిగివచ్చింది.

హోటలుకు రాగానే విమాన టికెట్టు లతనికి యిస్తూ, "రేపు ఉదయం 9.30. మీ ప్రయాణం. భోజనం ఇక్కడికే వస్తుంది. బయటకు వెళ్ళవలసిన అవసరం లేదు" అని అంది.

"మీ సమస్య...?" అంటూ ఏదో అడగబోయాడు.

ఆవిడ చిరునవ్వు నవ్వి "గుడ్‌నైట్" అని అంటూ వెళ్ళిపోయింది.

వెంకటాచలానికి రాత్రి ఎంత ప్రయత్నం చేసినా నిద్దర పట్టలేదు. మనస్సులో ఎన్నో ఆలోచనలు, ఎన్నో ప్రశ్నలు, ఎన్నో సందేహాలు, ఎన్నో సమాధానం దొరకకుండానే రాత్రి గడిచిపోయింది. వానలా కురుస్తున్న మంచు పూర్తిగా పోకుండానే తెల్లవారింది.

ఉదయం 8 గంటలకి శ్రీమతి దేశ్‌పాండే వచ్చింది. ఆ నగల పెట్టె ఒక్కసారి తెరిచి చూసింది.

"చాలా బాగుంది. ఇది మీ మహంతుగారికి జాగ్రత్తగా ఇవ్వండి" అని అంటూ

ఆ పెట్టె ఇచ్చింది.

తిరుగు ప్రయాణం కూడా సవ్యంగా జరిగింది. సరాసరి ఆలయానికి వెళ్ళి ఆ పెట్టె మహంతుగారికి ఇచ్చాడు. మహంతుగారు పేష్కారుగారు చాలా ఆనందించారు.

వెంటాచలం వంక చూసి నవ్వుతూ, "క్రియా సిద్ధిః సత్వేభవతి" అని అన్నారు.

మరునాడు ఆలయానికి అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు.

వెంకటాచలం కుటుంబానికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలన్నీ చేశారు. శేషవస్త్రం కప్పారు.

వెంకటాచలం యిల్లాలు పద్మావతి చేత అమ్మవారికి లండన్ నుంచి వచ్చిన యీ నూతన ఆభరణంతో అలంకరణ చేయించారు.

కుటుంబ సభ్యులందరికి నూతన వస్త్రాలు బహుకరించారు. పూజలు పూర్తి అయ్యాయి. ప్రసాద వినియోగం జరిగింది.

అందరి మనస్సులలోని ప్రశ్న ఒకటే:

ఏమిటిదంతా?

వెంకటాచలం ముందు యింకొక నగల పెట్టె ఉంచారు. "చూడు" అని సూచన వచ్చింది.

వెంకటాచలం ఆ నగ వంక చూశాడు. వెంటనే అమ్మవారి మెడలో తను లండన్ నుంచి తీసుకు వచ్చిన నగ వంక చూశాడు.

రెండూ ఒకటే! తేడా తెలియటం లేదు. రెండూ కెంపుల హారాలే. రెండూ ఆలయ ఆభరణాలే ... కాని?

"నీ ఉద్దేశ్యంలో దీని వెల ఎంత వుంటుంది?" అని మహంత్‌గారు అడిగారు.

వెంకటాచలం ఆ నగను అన్ని రకాలుగా పరీక్ష చేసి చివరకు తన నిర్ణయాన్ని చెప్పాడు. "ఇవి కెంపులు కావు. గార్నెట్స్. సుమారు నలభై యాభై సంవత్సరాల క్రితం విదేశాలలో తయారు చేయబడింది. ఎక్కువ వాడకం జరగ లేదు. ఈనాడు యీ నగ చేయించాలంటే ఒక యాభై వేల రూపాయలతో తయారు చేయవచ్చు."

'నువ్వు లండన్ నుంచి తీసుకు వచ్చింది, యీనాడు ఎంత ఉంటుంది?'

"అటువంటి నగ యీనాడే కాదు ఆనాడు కూడా చేయడం కష్టం. ఒకే జాతి, ఒకే సైజువి 108 కెంపులు ఇంత పెద్దవి దొరకడం చాలా కష్టం. దాదాపు అసాధ్యం. ఆ నగ చేసిన తీరు, పద్ధతి చూస్తే కొన్ని వందల సంవత్సరాల క్రితం చేసిన నగలాగా కనిపిస్తోంది. ఈ 108 కెంపులు బిగించిన తీరు హారం మధ్యలో ఉన్న లాకెట్ పనితనం ముఖ్యంగా ఆ శ్రీ చక్రం చెక్కిన తీరుపాంటోగ్రాఫ్ లేని రోజులలో ఎలా సాధ్యపడిందో ఆ భగవంతుడికే తెలియాలి. అమ్మవారి అనుగ్రహం. కటాక్షం సంపూర్ణంగా వున్న వ్యక్తే ఇటువంటి ఆభరణాన్ని సృష్టించ గలడు. పది పదిహేను లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఒక్క సంవత్సరం శ్రమిస్తే ఇటువంటి కళా ఖండం సాధ్యపడుతుంది. ఈ ఆభరణం అమ్మవారికి ఎవరు సమర్పించారో వారు ధన్యాత్ములు" అని అన్నాడు.

ఆ ధన్యాత్మురాలిని గురించి చెబుతాను వినండి" అంటూ మహంతుగారు

ప్రారంభించారు.

"తంజావూరు రాజ్యంలో తిరుమల నాయకుడు పరిపాలించేకాలంలో రంగాజమ్మ లనే గొప్ప కవయిత్రి వారి ఆస్థానంలో ఉండేది. సంగీతంలో, సాహిత్యంలో, సౌందర్యంలో ఆవిడకు ఆవిడే సాటి. ఎన్నో మంచి గ్రంథాలు

రాసింది. ఆవిడ తిరుమల నాయకుని ఇష్టసఖి.

ఆవిడ తీర్థయాత్రగా మన నగరం వచ్చిందని, అమ్మవారిని తనివి తీరా సేవించుకుని తన గుర్తుగా యీ హారాన్ని మీనాక్షి అమ్మవారికి సమర్పించిందని మన ఆలయ చరిత్ర చెబుతోంది. కాలమే అన్ని మార్పులకి మూల కారణం బండ్లు ఓడలు, ఓడలు బళ్ళు అయ్యాయి. ఆ మహారాజులు గతించారు. ఆ రాజ్యాలు కాలగర్భంలో కలసిపోయాయి.

మన నగరం మొగలాయిల వశమయింది. వారికి తెలిసిన పద్ధతిలో మనలను శ్రద్ధగానే పరిపాలించారు. విగ్రహ ఆరాధకులు కాకపోయినా మన ఆలయం యెడల వినయంగానే ఉన్నారు. వీరి అనంతరం వలందులు, ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు మనకు ప్రభువులయ్యారు. వలందుల కాలంలో కాని ఫ్రెంచి వారి హయాములో కాని మన నిత్యజీవనంలో పెద్ద మార్పులు రాలేదు. మన నగరం పల్లెనుంచి పట్టణంగా ఆంగ్లేయుల కాలంలో మారింది. ఇది రేపు పట్టణం కావడం, మంచి శీతోష్ణస్థితి, సమృద్ధిగా దొరికే ఆహారం, మంచి నీటి వసతికి ముగ్ధులై యీ ప్రాంతంలో తమ కార్యాలయాలన్ని నెలకొల్పుకున్నారు. ఈ ప్రాంతాన్ని ఒక జిల్లా చేసి దానికి మన గ్రామాన్ని ముఖ్య పట్టణం అన్నారు.

అది కూడా కాల మహత్యమే. ప్రభువుల ప్రాపకం ఉంటే తమ కేదో జరుగుతుందని కొందరు యీ సీమ దొరలకి అడుగుడులకు మడుగులు వత్తే తైనాతీలు, దుబాసీలు మన పరగణాలో కూడా అన్ని ప్రాంతాలలో లాగానే తయారైయ్యారు. ఆ సమయంలో సీమ నుంచి ఒక రాజకుమారుడు వచ్చాడు. పుట్టినది ఘనత వహించిన రాజవంశంలో. రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్య అధినేతలకు సన్నిహితుడు. రావడం ఒంటరిగా రాలేదు. జంటగానే వచ్చాడు. వాళ్ళిద్దరిని చూసి అతని దర్జా ఆ పిల్ల సౌందర్యం చూసి వాడ వాడంతా మెచ్చుకున్నారు.

భార్య అంటే ఇల్లా వుండాలి అని ఆ యువతిని రకరకాలుగా శ్లాఘించారు.

అనుకోకుండా ఆ జంట మన ఆలయానికి వచ్చారు. సీమ దొరలు మన ఆలయానికి వచ్చే అలవాటుగాని సంప్రదాయం కాని లేదు. కాని ఆ రోజు వాళ్లు వచ్చారు. సీమను ఏలే ప్రభువుల బంధువులని కాదనేవాళ్ళెరు! ఆలయ

మర్యాదలన్నీ చేశారు. శేష వస్త్రం ఇచ్చారు. తీర్థప్రసాదాలు ఇచ్చారు.

అంతవరకూ అంతా బాగానే జరిగింది. కాని ఆ చిన్నదానికి అమ్మవారి కెంపుల హారం మీద మనసైయింది. అది తనకు తప్పక కావాలని మంకు పట్టు పట్టింది. "ఈ నల్ల వాళ్లని చూసి భయపడుతున్నావా?" అని ఎగతాళి చేసింది. "మీ రాజరికం యింతేనా?' 'అని నిలదీసి అడిగింది.

మగవాళ్లకుండే బలహీనతలు అతనిలోనూ ఉన్నాయి. ఆ పిల్ల మాటలకు

అతనిలోని విచక్షణ, వివేకం నశించాయి.

సరాసరి గర్భ గుడిలోకి వెళ్లి అమ్మవారి మెడ నుంచి ఆ హారాన్ని ఇవ్వవలసిందని అక్కడి అర్చకుడికి హుకుం జారీ చేశాడు.

యజమానుల ఆజ్ఞకు తల వంచడం తప్ప స్వతంత్రంగా ఆలోచించే శక్తి లేని ఆ అర్చకుడు ఆ హారం అమ్మవారి మెడ నుంచి తీసి ఆ రాజకుమారుడి చేతిలో పెట్టాడు.

మరుక్షణం హారం ఆ చిన్న దాని కంఠసీమను అలంకరించింది.హారం గుడి దాటి బయటకు వెళ్ళిపోయింది.

ఆనాడు ... ...

ఏలిన వారితో చెప్పుకుందామంటే వారి కంటికి మనమంతా పగవారిమి కదా! మొరపెట్టుకున్నా అది అరణ్య రోదనయే కదా!

రాకుమారుడు, అతని కుటుంబం, కెంపుల హారం లండన్ మహా నగరం చేరుకున్నాయి,

నెమలి సింహాసనం, కోహినూర్ వజ్రం, రంగాజమ్మగారు ఇచ్చిన కెంపుల హారం పరదేశంలో స్థిర నివాసం ఏర్పరుచుకున్నాయి.

చెడువార్తలు యీ దేశం చేరుకునేసరికి చాలా కాలం పట్టింది. రాజకుమారుని వెంట వచ్చిన జగదేక సుందరి అతని ధర్మపత్ని కాదని, కట్టుకున్న భర్తకు విడాకులు యిచ్చి ఇతగాడి నీడను చేరిందని, రాకుమారుడు త్వరలో ఆమెను తన పట్ట మహిషిగా స్వీకరిస్తారని.

అతని దురదృష్టానికి, తెలివి తక్కువ చర్యకు ఎవ్వరూ అతన్ని నిందించలేదు - చాలా మంచివాడని మెచ్చుకున్నారు. కారణం -

చెడు వార్తల కంటె ముందుగా, వచ్చిన శుభవార్త. మన జిల్లాకు వచ్చిన కలెక్టరుగారి ద్వారా ఈ హారం మన ఆలయానికి తిరిగి వచ్చింది.

ఆ రాజకుమారుడు మనమంతా అనుకున్నంత దుర్మార్గుడు కాదనే నిర్ణయానికి వచ్చాం. ఆనాడు వూరంతా పండుగ చేసుకున్నాము.

భర్త నుంచి విడాకులు తీసుకున్న స్త్రీని వివాహమాడినందుకు అతను రాజ్యాధికారాన్ని వదులుకోవలసివచ్చిందని విన్నవాడు అతనిని గురించి అంతా జాలిపడ్డారు.

కాని ఆ జాలి ఎక్కువ కాలం నిలువ లేదు.

సుమారు పది సంవత్సరాల క్రితం మైసూరు నుంచి ఒక ప్రముఖ నగల వ్యాపారి మన నగరానికి వచ్చాడు. ఆలయ ఆభరణాలు చేయించడం, విలువ కట్టడం లాంటి విషయాలలో అతను నిష్ణాతుడు. వారి కోరిక మేరకు అమ్మవారి ఆభరణాలు వారికి చూపించాము. ఆయన యీ హారం వంక చూసి బాగా పరీక్ష చేసి తంజావూరు నుంచి వచ్చిన హారం ఇది కాదని ఘంటా పథంగా చెప్పాడు.

అటువంటి దుర్మార్గుడికి మోసగాడికి పదవి పోయినందుకు చాలా సంతోషించాము...

అసలు హారం ఏనాటికైనా యీ ఆలయానికి తిరిగి వస్తే బాగుండునని ఆశించాం.

కథా నిలయం
4818
శ్రీకాకుళం

ఆ ఆది పరాశక్తిని కొలిచాం.

ఆ అమ్మకు మా మీద జాలి కలిగింది.

రాజకుమారుడు పదవి పోగొట్టుకున్నాడు.పరగణా వదులుకున్నాడు. అనామకుడుగా అజ్ఞాత వాసంలో పరాయి దేశంలో బ్రతుకుతున్నాడు. సర్వం వదులుకుని వివాహం చేసుకున్న ప్రియురాలు మందులేని వ్యాధికి గురి అయింది. కడపటి కాలంలో కనిపెట్టి చూడటానికి కడుపున పుట్టిన బిడ్డలు లేరు. ఆదాయం సామాన్యం. వ్యయం అనంతం. అందుకే దూరమయ్యాయి, సుఖశాంతులు. భార్యను వైద్యశాలకు తీసుకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి దొంగలు పడి ఇల్లంతా దోచుకున్నారు. మన అదృష్టం కొద్దీ యీ హారం వాళ్ళ కంట పడలేదు. కాని ఇన్ని బాధలని, శాపాలని ఆ శరీరం తట్టుకోలేకపోయింది. పరమ పదం చేరింది.

నిరాశతో, నిస్పృహతో, పశ్చాత్తపంతో ఒంటరిగా దిక్కులేనివాడుగా మరణించాడు.

ఈ సంఘటన జరిగిన తరువాత ఆవిడ ఎక్కువ కాలం యీ భూమి మీద నిలవలేదు. ఒంటరితనం. ఆర్థిక సమస్యలు. బంధుజన నిరాదరణ, వృద్ధాప్యం, అనారోగ్యం - ఇవన్నీ తోడయ్యాయి.

చివరి రోజులలో తన ఏకైక స్నేహితురాలు మిసెస్ రిచెర్డ్‌సన్‌తో చెప్పింది.

"ఈ హారం తీసుకుని చాలా పొరబాటు చేశాము. మా వల్ల చాలా పెద్ద పాపం జరిగింది. అందుకే యిన్ని కష్టాలు పడ్డాం. ఆ హారం మాకు పెద్ద శాపం అయింది. ఎలాగైనా దీన్ని భారతదేశానికి పంపించండి... ఆలస్యం చేయవద్దు. ప్లీజ్!" అంటూ ప్రార్థించింది. తరువాత ఆవిడ మన అందరికి చాలా దూరం వెళ్ళిపోయింది.

మిసెస్ రిచర్డ్‌సన్, శ్రీమతి దేశ్‌పాండే స్నేహితులు కావడం మన అదృష్టం. ఆవిడ కృషి ఫలితమే ఇంత అమూల్యమైన మన వస్తువు మనకు ఏ ఇబ్బంది లేకుండా మన దేశానికి చేరడం."

"మరి నన్ను..."

"నిన్ను పంపించి ఆ హారం ఎందుకు పరీక్ష చేయించామంటే ఇది కలియుగం. ఉద్దేశాలు మంచివైనా అవి ఆచరణలోకి వచ్చేసరికి మారిపోవచ్చు. మేము రెండవ సారి మోస పోదలుచుకోలేదు."

అందరి మనస్సుల్లో మసలింది దగా పడిన ప్రేమికుల జంట!!

కొస మెరుపుగా మహంతుగారు, "ప్రతి సంవత్సరం ఇదే రోజున ఆ రాజకుమారుడు అతని ఇల్లాలి పేర ప్రత్యేకమైన పూజలు చేయించడానికి నిశ్చయించాం' ' అని అన్నారు.

గుడిలోని దేవత 'తథాస్తు!' అని అన్నది. స్వర్గంలో రెండు ఆత్మలకు శాంతి లభించింది.